సత్వరం గుర్తిస్తే చికిత్స సులభం

పూర్వం రాచపుండుగా పిలువబడే క్యాన్సర్ వ్యాధికి చికిత్స ఉండేది కాదు. వ్యాధిగ్రస్తులు మరణానికి రోజులు లెక్క బెట్టుకుంటూ గడిపేవారు. ప్రస్తుతం ఈ పరిస్థితి మారింది. ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. క్యాన్సర్‌ను నిర్ధారించే దశను బట్టి, అందించే చికిత్స ఆధారంగా త్వరగా నివారించవచ్చు. ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేస్తే నూటికి 95 శాతం క్యాన్సర్‌లను నయం చేయవచ్చు. క్యాన్సర్ ఉన్న వారిలో వ్యాధి పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి మానసిక ధైర్యాన్ని నింపేందుకు ప్రతి ఏడాది జూన్ నెలను క్యాన్సర్ సర్వైవర్ మంత్‌గా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

- క్యాన్సర్‌కు అందుబాటులో ఆధునిక వైద్య సేవలు
- ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిస్థాయిలో నివారణ సాధ్యమే
- 'క్యాన్సర్ సర్వైవర్స్ నెల'గా జూన్



గుంటూరు మెడికల్ : క్యాన్సర్ రావటానికి ప్రధాన కారణం పొగాకు ఉత్పత్తుల వినియోగమే. సిగరెట్, బీడీ, చుట్ట, పాన్ పరాగ్, ఖైనీ, గుట్కా ఇలా ఏ రూపంలో పొగాకును తీసుకున్నా క్యాన్సర్ వస్తుంది. మద్యపానం వల్ల, వ్యాయామం చేయకపోవటం, ఆకుకూరలు తినకపోవటం, ఊరగాయ పచ్చళ్లు, కొవ్వు ఎక్కువగా ఉన్న మాంసాహారం తినటం, అధిక బరువు ఉండటం వల్ల కొన్ని రకాల క్యాన్సర్‌లు వచ్చే అవకాశం ఉంది.

రాకుండా ఇలా...

ఊబకాయం వల్ల చాలా మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. బరువును అదుపులో ఉంచుకోవటం ద్వారా క్యాన్సర్ సోకదు. షుగర్ కంట్రోల్‌లో పెట్టుకోవాలి. జెనటిక్ టెస్ట్‌లు చేయించుకోవాలి. కుటుంబంలో ఒకరికి క్యాన్సర్ ఉంటే ఇతర సభ్యులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. తాజా కూరగాయలు, ఆకు కూరలు తీసుకోవాలి. వీటిల్లో క్యాన్సర్ కారకాలతో పోరాడే యాంటిజెంట్స్ ఉంటాయి. మాంసాహారం తీసుకునేవారు తప్పనిసరిగా వెజిటబుల్ లేదా ఫ్రూట్ సలాడ్ తినాలి. కొవ్వుశాతం తక్కువగా ఉన్న ఆహారం తీసుకుంటే క్యాన్సర్‌లు వచ్చే అవకాశాలు తక్కువ. భోజనంతో తాజా పండును రోజూ తీసుకోవాలి. రోజూ కనీసం అరగంటసేపు శారీరక వ్యాయామం చేయాలి. స్మోకింగ్, మద్యం, పాన్, గుట్కా లాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి.

జీజీహెచ్‌లో కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితం



గుంటూరు జీజీహెచ్‌లో క్యాన్సర్ రోగుల కోసం ప్రత్యేకంగా 100 పడకలతో ప్రభుత్వం, నాట్కో ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రూ.40 కోట్లతో నన్నపనేని లోకాదిత్యుడు, సీతారావమ్మ స్మారక క్యాన్సర్ సెంటర్ నిర్మాణం చేపట్టాం. రోగులకు ఆధునిక వైద్యసేవలను అందించేందుకు ప్రభుత్వం లినీయర్ యాక్సిలేటర్, బ్రాకీథెరపీ, సీటీ స్టిమ్యులేటర్ వైద్య పరికరాలను విదేశాల నుంచి కొనుగోలు చేసి జీజీహెచ్‌కు పంపించింది. అంతర్జాతీయ వైద్య ప్రమాణాలతో క్యాన్సర్ రోగులకు కార్పొరేట్ వైద్యసేవలను పూర్తి ఉచితంగా అందజేస్తున్నాం.

– నన్నపనేని సదాశివరావు, నాట్కో ట్రస్ట్ వైస్ చైర్మన్

అందుబాటులో ఆధునిక వైద్యం



క్యాన్సర్‌ను నయం చేసే ఆధునిక వైద్య పద్ధతులు నేడు అందుబాటులో ఉన్నాయి. మెమోగ్రామ్ ద్వారా రొమ్ము క్యాన్సర్, పాప్ స్మియర్ ద్వారా సర్వైకల్ క్యాన్సర్‌ను, కొలనోస్కోపీ ద్వారా కోలన్ క్యాన్సర్‌లను గుర్తించవచ్చు. స్మోక్ చేస్తున్నవారు చెస్ట్ సీటీ స్కాన్ చేయించుకోవాలి. ముందస్తుగా వ్యాక్సిన్‌లు వేయించుకోవటం ద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ల నుంచి రక్షించుకోవచ్చు. 9 నుండి 11 సంవత్సరాల బాలురు, బాలికలకు వోరల్, త్రోట్ క్యాన్సర్‌లు రాకుండా ముందస్తుగా వ్యాక్సిన్‌లు చేయించాలి.

–డాక్టర్ బైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్య నిపుణురాలు, గుంటూరు.

శివారు ప్రాంతాల్లో మౌలిక వసతులపై దృష్టి


శంకుస్థాపన చేస్తున్న మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

నెహ్రూనగర్: గుంటూరు నగరంలోని శివారు ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర పేర్కొన్నారు. గురువారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 50, 4వ డివిజన్లలో రూ.75.50లక్షలతో తాగు నీటి పైపు లైన్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుకు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు శివారు ప్రాంతాలలో ప్రధానంగా తాగునీరు, రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ మేరకు ఇప్పటికే కౌన్సిల్, స్టాండింగ్ కమిటీ సమావేశాలలో అనుమతులు మంజూరు చేశామన్నారు. కార్పొరేటర్ల నుంచి ప్రతిపాదనలు తీసుకొని ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడుతున్నామన్నారు. నిర్దేశిత గడువు లోపు నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని, ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విలీన గ్రామాల్లో కూడా అభివృద్ధికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, ఈఈలు, బీజేపీ నాయకులు, టీడీపీ, జనసేన నాయకులు, అధికారులు, సచివాలయాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పంచ భూతాలలో విశిష్టమైనది వాయువు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (మహిళా విభాగం) ఆధ్వర్యంలో గురువారం 'నేటి కథ – ఈనాటి మహిళ' అనే అంశంపై సభ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి ప్రసంగిస్తూ పంచభూతాల్లో వాయువు ఎంతో విశిష్టమైనదని అన్నారు. ప్రాణి మనుగడకు ఊపిరి వాయువని పేర్కొన్నారు. పూర్వీకులు వాయువును దేవతాశక్తిగా భావించి పూజించారని చెప్పారు. ప్రముఖ కథా రచయిత్రి గోటేటి లలితాశేఖర్, డాక్టర్ మైలవరపు లలితకుమారి, విజయలక్ష్మి, డాక్టర్ మాధవపెద్ది విజయలక్ష్మి తదితరులు కూడా ప్రసంగించారు.

ఆ ప్రైవేటు స్కూళ్ల గుర్తింపు రద్దు చేయాలి

డీవైఎఫ్ఐ కన్వీనర్ వై.కృష్ణకాంత్ డిమాండ్

లక్ష్మీపురం: విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు విద్యాసంస్థలలో ఫ్రీ అడ్మిషన్ వచ్చిన వారిని ఇంత వరకు చేర్చుకోని ప్రైవేటు విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్ కోరారు. గుంటూరు బ్రాడీపేట డీవైఎఫ్ఐ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాల పిల్లలకు వారు నివాసం ఉండే ప్రాంతంలో ప్రైవేటు విద్యాసంస్థలలో ఫ్రీ అడ్మిషన్ వచ్చిన వారిని కొన్ని విద్యాసంస్థలు ఇంత వరకు చేర్చుకోకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనగా ఉన్నారని పేర్కొన్నారు. కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు యూనియన్‌గా ఏర్పడి ఈ చట్టాన్ని అమలు చేయకుండా విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్ 12వ తేదీన విద్యాసంస్థలు ప్రారంభం కాగానే విద్యార్థులను చేర్చుకోవాల్సి ఉందని, ఇంత వరకు ఆ పని చేయలేదని పేర్కొన్నారు. 2025 సంవత్సరానికి మొదటి తరగతి విద్యార్థులకు తల్లికి వందనం పథకం దరఖాస్తుకు 20వ తేదీ గడువు అని గుర్తుచేశారు. ప్రైవేటు విద్యాసంస్థల నిర్లక్ష్యంతో విద్యార్థులను చేర్చుకోకపోవడం వల్ల వీరందరూ నష్టపోతున్నారని తెలిపారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

లక్ష్మీపురం: ఘర్షణలో ఇద్దరు యువకులకు గాయాలు అయిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజ్జనగుండ్ల మసీదు సెంటర్ ప్రాంతానికి చెందిన ఖాజా బైక్ మెకానిక్. రసూల్, ఖాజా, సుభానిలు తాపీ పని చేసుకుంటూ ఉంటారు. వీరందరూ మిత్రులు. ఇటీవల మనస్పర్థలు రావడంతో ఘర్షణ పడ్డారు. రసూల్, ఖాజాలకు గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స అనంతరం గురువారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పట్టాభిపురం ఎస్సై నరహరి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిడమర్రు రోడ్డు విస్తరణకు సన్నాహాలు


కొలతలు వేసి మార్కింగ్ చేస్తున్న సిబ్బంది

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పరిధిలోని నిడమర్రు రోడ్డు విస్తరణకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సీఆర్‌డీఏ అమరావతికి ప్రధాన రహదారి అయిన నిడమర్రు రోడ్డు విస్తరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. రోడ్డు విస్తరణకు ఎలాంటి అభ్యంతరాలు లేకపోయినా ప్రభుత్వం నిర్ణయంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి స్థానిక పాతబస్టాండ్ సెంటర్ నుంచి నిడమర్రు మీదుగా అమరావతి సచివాలయానికి 155 అడుగుల మేర రోడ్డు విస్తరణ చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీంతో నిడమర్రు రోడ్డు లోని పలు నివాసాలు పూర్తిగా తొలగించాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాక నిడమర్రు, కురగల్లుతో పాటు పలు గ్రామాలలో స్థానికులు నివాసాలను సగానికిపైగా కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. గత రెండు రోజులుగా సీఆర్‌డీఏ సిబ్బంది సర్వే చేస్తుండగా స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. రోడ్డు విస్తరణ చేపట్టడానికి తాము వ్యతిరేకం కాదని.. ప్రభుత్వం ఇప్పటికైనా నిర్ణయం మార్చుకుని రోడ్డు విస్తరణను తగ్గించి తమకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డు విస్తరణలో నష్టపోతున్న తమకు సరైన నష్టపరిహారం అందేలా అధికారులు, ప్రభుత్వం చూడాలని కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పట్నంబజారు: అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు మండలం ఈదులపాలెం గ్రామానికి చెందిన జంగాల సిద్ధయ్య అలియాస్ రేణుక స్వామి ఈ నెల 17న గుంటూరుకు పనుల నిమిత్తం వచ్చాడు. పల్నాడు బస్టాండ్ సెంటర్‌లో అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని 108 అంబులెన్సులో జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. సిద్ధయ్య భార్య బోడెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యోగాతో విద్యార్థులకు జ్ఞాపకశక్తి


యోగా సాధన చేస్తున్న చిన్నారులు

మంగళగిరి, మంగళగిరి టౌన్: యోగా చేయడంతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుందని యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష అన్నారు. మంగళగిరి నగర పరిధి చినకాకానిలోని షైన్ ఆనంద శరణాలయంలో గురువారం బాలబాలికలకు యోగా శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలబాలికలకు క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు ఆరోగ్యంపైన కూడా అవగాహన పెంచుకోవాలని అన్నారు. నేడు విద్యలో పోటీతత్వం పెరిగి విద్యార్థుల్లో ఒత్తిడి పెరుగుతోందన్నారు. యోగా సాధనతో మానసిక ఒత్తిడి తగ్గుతుందని.. చదివిన పాఠ్యాంశాలు కూడా గుర్తుండి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధిస్తారని అన్నారు. రోజూ యోగా సాధన చేయడం అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం యోగా గురించి రాధాకృష్ణ బాలబాలికలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు డీజీ నాయక్, సంధ్యారాణి, బాలబాలికలు పాల్గొన్నారు.

వానరాలతో ఇక్కట్లు


గోడపై తిష్ట వేసిన వానరాలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో వానరాల బెడద ఎక్కువైంది. పదుల సంఖ్యలో ఉన్న వానరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయం భయంగా రావాల్సి వస్తోందని వాపోతున్నారు. గ్రామంలోని రాజాపేట, కొండమెట్లబజార్, జెండాచెట్టు సెంటర్, రామాలయం వీధి, బాల ఏసుదేవాలయ సమీప ప్రాంతం, హైస్కూల్ సెంటర్ ప్రాంతాల్లో ఈ వానరాలు గుంపులు గుంపులుగా చేరుతున్నాయి. పాఠశాలలకు వెళుతున్న పిల్లలు, పనులకు వెళ్లే వారి వెంటపడి కొందరిని గాయపరిచాయి. పంచాయతీ అధికారులు స్పందించి వానరాలను పట్టించి అడవి ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యోగాతో మానసిక దృఢత్వం


యోగా సాధన చేస్తున్న భాష్యం రామకృష్ణ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: యోగాతో శారీరక ఆరోగ్యంతోపాటు మానసికంగా దృఢత్వం అలవడుతుందని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. యోగాంధ్రలో భాగంగా భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో మూడు రోజుల యోగోత్సవ్ కార్యక్రమాన్ని మొదటి రోజు ఇన్నర్ రింగు రోడ్డులోని గరుడ క్యాంపస్‌లో గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ దేశాలు సైతం యోగాను ఆచరించి అద్భుత ఫలితాలను పొందుతున్నాయన్నారు. విశ్రాంత వ్యాయామ శిక్షణాధికారి ఆళ్ల రాజేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకుంటే ఏకాగ్రత, లక్ష్యసాధనలో ఉన్నత ఫలితాలను సాధించవచ్చన్నారు. మనసును స్థిరంగా ఉంచడానికి యోగా ఎంతో ఉపకరిస్తుందని విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్రాణాయామం, యోగాసనాల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో కలిసి రామకృష్ణ యోగాసనాలు వేశారు. భాష్యం అన్ని బ్రాంచీలలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ జోక్యంతోనే ముదురుతున్న సంక్షోభం


మాట్లాడుతున్న ఆర్.వి సింగరయ్య

లక్ష్మీపురం: యుద్ధాలను ఆపేస్తానంటూ గద్దెనెక్కిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాటికి మరింతగా ఆజ్యం పోయడం గర్హనీయమని విశ్లేషకులు ఆర్.వి. సింగరయ్య అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ట్రంప్ కెనడాలో జరుగుతున్న జీ –7 శిఖరాగ్ర సమావేశాల నుంచి అర్ధాంతరంగా స్వదేశం బయలుదేరి వెళ్లడంతో ఇజ్రాయిల్ – ఇరాన్‌ల మధ్య యుద్ధంలో మరిన్ని తీవ్ర పరిణామాలు సంభవించవచ్చన్న ఊహాగానాలు వ్యాపించాయన్నారు. రాజ్యాంగ చర్చా వేదిక కార్యదర్శి అవధానుల హరి, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ పరిస్థితి ముదిరితే ఇది మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీయవచ్చునని పేర్కొన్నారు. విశ్రాంత అధికారి పి.భావన్నారాయణ, విశ్లేషకులు వీఎస్ఎన్ మల్లేశ్వరరావు, గుప్తాలు ప్రసంగించారు.

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేద్దాం

మానసిక ఒత్తిడి లేని ఆరోగ్యకరమైన జీవన సరళికి యోగా కీలకమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేద్దాం' అంటూ సమావేశం నిర్వహించారు. ఇంజినీర్ ఎస్.సదాశివం, సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో మలేరియా కట్టడి


ర్యాలీలో సుబ్బరాయణం, వైద్యులు, వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్: అవగాహనతో మలేరియాను కట్టడి చేయవచ్చని జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం అన్నారు. జాతీయ మలేరియా నివారణ మాసోత్సవం సందర్భంగా గురువారం స్థానిక మంగళదాస్‌నగర్ అర్బన్ పీహెచ్‌సీలో మలేరియా అవగాహన ర్యాలీ జరిగింది. ర్యాలీని ప్రారంభించిన అనంతరం సుబ్బరాయణం మాట్లాడుతూ దోమలు వర్షాకాలంలో వృద్ధి చెందుతాయని గుర్తు చేశారు. దోమల ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి వ్యాధులు దోమ కాటు ద్వారా వస్తాయని తెలిపారు. దోమలు పెరగకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. దోమ కాటు నుంచి రక్షణ కోసం తెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే రిపోర్టు ఇవ్వడం లేదని ఆందోళన


నిరసన వ్యక్తం చేస్తున్న శ్రీలక్ష్మి, శివపార్వతి, గాంధీ

నెహ్రూనగర్: తమ స్థలానికి సంబంధించిన సర్వే రిపోర్టు ఇవ్వకుండా సర్వేయరు మూడు నెలలుగా ఇబ్బంది పెడుతున్నారని పాత గుంటూరుకు చెందిన గుర్రం శ్రీలక్ష్మి, ఆమె తల్లి శివపార్వతి, తాత కుర్రా గాంధీలు ఆరోపించారు. ఈ మేరకు గురువారం రాత్రి నగరపాలక సంస్థ కార్యాలయంలో బైటాయించి తమకు సర్వే రిపోర్టు ఇవ్వాలని నిరసన వ్యక్తం చేశారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. తక్కెళ్లపాడు హెడ్‌వాటర్ వర్క్స్ ఎదురుగా ఉన్న 126 గజాల స్థలాన్ని 2024వ సంవత్సరంలో కొనుగోలు చేశామని తెలిపారు. డాక్యుమెంట్‌లో సర్వే నంబర్ 590కి బదులు 575/1ఏగా పడిందని చెప్పారు. దీని సవరణకు మూడు నెలల క్రితం రూ.2 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకున్నానని చెప్పారు. కానీ తూర్పు సర్వేయరు సుభాని, అతని అసిస్టెంట్ సిలార్ కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించారని, అతనికి సహకరించి తమకు సర్వే రిపోర్టు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. బెంగళూరులో ఉంటున్న తనను మూడు నెలలుగా కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు తగిన న్యాయం చేయాలని కోరారు.

● ఆత్మకూరు చెరువుపై డేగకన్ను!


ఆత్మకూరు చెరువుపై నిర్మించిన రేకుల షెడ్డు

టీడీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం కొందరి కళ్లు ఆత్మకూరులోని చెరువు భూమిపై పడ్డాయి. సర్వే నెంబర్ 143లో గల చెరువు భూమి ఆక్రమణకు గురవుతోంది. అధికార పార్టీ నేతల అండతో చెరువు భూమిని ఆక్రమించి రేకుల షెడ్లు నిర్మించినా అధికారులకు కనిపించకపోవడం స్థానికంగా చర్చనీయాంశం అయ్యింది. టీడీపీ కార్యకర్త 10 సెంట్ల చెరువు స్థలం ఆక్రమించి షెడ్డు నిర్మించినా అధికారులకు కనిపించకపోవడం గమనార్హం. ఎంతో విలువైన చెరువు స్థలం ఆక్రమించి బహిరంగంగా షెడ్లు నిర్మిస్తున్నారని.. వెంటనే అధికారులు చెరువు భూమి ఆక్రమణను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామ వీఆర్వో ఎ.గుదారి అంకయ్యను వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి రాలేదని.. వెంటనే పరిశీలించి ఆక్రమణలను తొలగించడంతో పాటు ఆక్రమణదారులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- ఆత్మకూరు(మంగళగిరి)

సేవాసమితి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ

తెనాలి: భగవత్ కృప పొందటానికి ఏ సాధనము అవలంభించాలో శాస్త్రాలు తెలియజేశాయనీ, ఆ ప్రకారం కలియుగంలో దానం ముఖ్యమైందని శ్రీసాయిప్రసాదం సేవాసమితి అధ్యక్షుడు సాయి లక్కరాజు అన్నారు. సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం గాంధీనగర్‌లోని పట్టణ పేద నిరాశ్రయుల ఆశ్రమంలోని పేదలకు అన్నప్రసాద వితరణ చేశారు. కృతయుగంలో తపస్సు, త్రేతాయుగంలో జ్ఞానం, ద్వాపరయుగంలో యజ్ఞం అనుసరించాల్సిన సాధనాలుగా వివరించారు.

క్లుప్తంగా

కార్పొరేట్ కళాశాలలపై చర్యలకు డిమాండ్



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యా వ్యాపారాన్ని సాగిస్తున్న కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ గుంటూరు జిల్లా కన్వీనర్ వంశీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బృందావన్‌గార్డెన్స్‌లోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తుండగా ఏబీవీపీ నాయకులు అడ్డుకున్నారు. కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల నుంచి రూ.వేలు ఫీజులు వసూలు చేస్తున్న కళాశాల యాజమాన్యం క్యాంపస్‌లోనే స్టడీ మెటీరియల్, పుస్తకాలు, యూనిఫాం సైతం విక్రయిస్తోందని పేర్కొన్నారు. విద్యాసంస్థను వ్యాపార సంస్థగా మార్చివేయడం తగదన్నారు. తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్న ఎస్ఆర్ కళాశాలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కౌశిక్, నగర సంయుక్త కార్యదర్శి శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఉచిత కంటి వైద్యశిబిరం

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో గురువారం స్థానిక కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర బాలికల ఉన్నత పాఠశాలలో 9,10 వ తరగతుల విద్యార్థినులకు ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పటల్–విజయవాడ వారు కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేస్తామని రోటరీ క్లబ్ బాధ్యులు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి డి.మురళీకృష్ణ, ఈదర పూర్ణచంద్, గుత్తా వెంకట రత్నం, పావులూరి రాంబాబు, కన్నెగంటి మురళీకృష్ణ, కె.ఉపేంద్ర, ఆలపాటి కిరణ్, వెంపటి హరిప్రసాద్, మల్లాది అర్జున్, ఆర్.సుబ్బారావు, ఎస్.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మృత్తికా బృందావన వార్షిక వేడుకలు ప్రారంభం




నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 4/19వ అడ్డ రోడ్డులోని జగద్గురు శ్రీరాఘవేంద్రస్వామి వారి మృత్తికా బృందావన 44వ వార్షిక వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. రంగపూజ వెండి రథంపై ఊరేగింపు, తొట్టి పూజ చేపట్టి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ నెల 20న పాదపూజ, ప్రధాన హోమం, కలశాభిషేకం, పంచామృతం, పూర్ణాహుతి, మహాపూజ ప్రసాద వితరణ, సాయంత్రం రంగపూజ, పల్లకి, రథసేవలు, ఉయ్యాల సేవ నిర్వహిస్తామని శ్రీగురురాజ సేవాసమితి నిర్వాహకులు తెలిపారు.

వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్



లక్ష్మీపురం: వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ నగరంపాలెం, అరండల్‌పేట, పట్టాభిపురం పరిధిలో ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులకు అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. కార్యక్రమాల నిర్వహణకు ముందస్తు అనుమతి తీసుకోవాలని తెలిపారు. గురువారం నుంచి 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్న విషయాన్ని గుర్తించాల్సిందిగా సూచించారు. శుభకార్యాలలో రోడ్లపై డీజేలు ఏర్పాటు చేయాలంటే పోలీస్ అనుమతులు తీసుకోవాల్సిందిగా పేర్కొన్నారు.

నిధులు మంజూరు చేసిన ప్రధానికి కృతజ్ఞతలు



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్‌లోని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నివాస భవనాల కోసం నిధులు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ అన్నారు. గుంటూరు చంద్రమౌళి నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతిలో కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.2,787 కోట్లను మంజూరు చేసిందన్నారు. త్వరలోనే టెండర్లు కాల్ ఫర్ చేసి కేంద్ర ప్రభుత్వం నిర్మాణాలు చేపట్టబోతున్నట్లు పేర్కొన్నారు.